**ఈ వేళ్టికి వారం రోజుల్నుంచి ఇంటి కెళ్ళడానికి మహాభయంగా ఉంటోంది నాకు. అందుకే సూర్యుడు అస్తమించి చాలాసేపైనా అలా పార్కులోనే కూర్చున్నాను.**

**ఇంటికెళ్ళడానికి భయపడుతున్నానంటే— నేనేదో ఇబ్బందుల్లో ఉన్నాననో; ఇంట్లో పోట్లాట పెట్టుకున్నాననో; నిరుద్యోగిననో ఇలా సవాలక్ష అనుమానాలు కలగడం సహజం! అయితే వీటిలో ఏ ఒక్కటీ నిజం కాదు. బతుకు నెట్టుకొచ్చే ఉద్యోగంతోపాటు భార్యా, ముగ్గురు పిల్లలూ ఉన్నారు నాకు. మా పెద్దమ్మాయికి మొన్న మాఘమాసంలో పెళ్ళి చెయ్యటం కూడా అయింది.**

మా అల్లుడిగారిది సీతానగరం. అదింకా పట్నం పోకడలు సోకని పల్లెటూరు. ఆ ఊళ్ళో టైలరింగ్ నేర్చుకుంటున్న అల్లుడుగారు పెళ్ళవ్వగానే మా పట్నం వచ్చేసి టైలరింగ్ షాపు పెట్టేస్తానని కూర్చున్నారు. మీరు ఇప్పుడే షాపు పెడితే మీ చేత బట్టలు కుట్టించుకున్న వాళ్ళంతా నా మీదికి పోట్లాట కొస్తారని నచ్చచెప్పి బట్టలు కుట్టడంలో బ్రహ్మాండమంత పేరున్న బాబూరావుకి ఆయన్నప్పగించాను.

ఆయన పనివాడవ్వగానే టైలరింగ్ షాపు పెట్టించాలి. ఇంటర్ చదివి ఇంట్లో ఖాళీగా ఉంటున్న అబ్బాయికి ఉద్యోగం చూపించాలి. మా ఆఖరమ్మాయి వసంతకు వరుణ్ణి వెతకాలి... ఇలాంటి బరువు బాధ్యతలెన్నో నెత్తిమీదున్న నేను ఇంటి కెళ్ళడానికి ఎందుకు భయపడుతున్నానూ అంటారా....

ఆఫీసులో అలసిపోయి ఆ తర్వాత ఎక్కడెక్కడో తిరిగి ఇల్లు చేరిన నన్ను— "ఏమండీ! ఏమైనా తెలిసిందా?" అంటూ గత ఆరురోజులుగా వీధిగుమ్మంలో నిలేస్తుంది శ్రీమతి.

ఆ ప్రశ్న వినడంతోనే ఒంటికి కారం రాసుకున్నట్టు ఉంటుంది నాకు. నిజంగా కారం రాసుకున్నవాడిలా కాస్సేపు శ్రీమతి మీద ఎగిరిపడతాను. ఆ గొడవ నా దగ్గర తేవద్దని కసురుకుంటాను. నేను ఎగిరిపడినంతలో జడుసుకోవడం, కసురుకుంటే కళ్ళ నీళ్ళు పెట్టుకోవడం శ్రీమతి ఎప్పుడో మానేసింది. కొన్ని క్షణాలు ఊరుకున్నట్టే ఊరుకొని "ఏం చేద్దామండీ! అలా వొదిలెయ్యడమేనా!?" అంటుంది మళ్ళీ. "అంతకన్నా చెయ్యగలిగింది లేదు గనక అదే ఉత్తమోత్తమం!" అంటా నేను.

అంతే ఇక చూసుకోండి— నేను ఎగిరిపడ్డా కసురుకున్నా ఏమాత్రం చలించని శ్రీమతి నయనాలు వెంటనే నీళ్ళతో నిండుకుంటాయి. ఎప్పుడు క్రింది కురుకుదామా అని వేగిరపడుతుంటాయి. "మీరు కావాలనే ఇలా చేస్తున్నారు. పోతే పోయిందని ఊరుకుంటున్నారు. మీకు బాధ లేదండీ! ఏమాత్రం బాధలేదు!!..." అంటుంది అదేదో సినిమాలో డైలాగులా.

నిజానికి ఇలా జరిగినందుకు నేనెంత బాధపడుతున్నానో శ్రీమతికి తెలియదు. డబ్బు పెట్టి కొన్న వస్తువు పోయిందీ అంటే నాకేమిటి మీకేమిటి ఎవరికైనా బాధే!... ఆ బాధను నలుగురికీ చెప్పుకొని మరింత బాధపడిపోతోంది శ్రీమతి. నేనెవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నాను. ఇంకో విధంగా చెప్పాలంటే సిగ్గుపడుతున్నాను. సిగ్గెందుకూ అంటే— మా అల్లుడుగారు అంతటి ఘనకార్యం చేశారు మరి...

పెళ్ళప్పుడు కొనిస్తానన్న చేతిగడియారం— ఉగాదినాడైనా కొనివ్వలేదని ఆయన మనసులోనే కుమిలి పోతున్నట్టు అమ్మాయి చెప్పిందొకరోజు. విజయదశమికొచ్చే బోనసుతో అల్లుడిగారికి గడియారం కొనిచ్చేద్దామనే నేను అనుకుంటున్నాను. అమాటే అమ్మాయితో అంటే— 'అమ్మో! ఇంకా అయిదు నెలలు గడవాలి కదా. అప్పటివరకూ ఆయన ఆగేటట్టులేరు' అంది ఇక ఆలస్యం చెయ్యడం మంచిది కాదని— ఆపదలో అడ్డుపడే అనంతయ్యను కలుసుకొని సంగతి చెప్పి అయిదువందలు అప్పు అడిగాను.

అతను మాట తీసెయ్యకుండా డబ్బిస్తూ "శేఠ్ చందనలాల్ దగ్గర కెళ్ళు. తాకట్టులో ఉన్న గడియారాలు కొత్తవైనా సరే ఆర్నెల్లలోగా విడిపించుకోకపోతే అమ్మేస్తుంటాడతను!" అంటూ చిన్న సలహా కూడా ఇచ్చాడు.

అతని మాటలు నేనంతగా పట్టించుకోలేదు. పదో పాతికో ఎక్కువైనా కొత్తది కొనిస్తేనే బావుంటుందనిపించి— మర్నాడు అల్లుడిగారిని తీసుకెళ్ళి కొనిచ్చేద్దామని నిర్ణయించుకొని ఆఫీసుకెళ్ళిపోయాను.

అయితే అనుకోకుండా ఆ మరుసటిరోజే ఆఫీసు పనిమీద పది రోజులు కేంపు తగిలింది నాకు. వెళ్ళేముందు అల్లుడిగారిని పిల్చి వచ్చిన గడియారం కొనుక్కోమని అయిదువందలూ ఆయన చేతిలో పెట్టాను. అప్పుడాయన ముఖం పున్నమి చంద్రుడిలా వెలిగిపోయింది. మేలిమి బంగారంలా మెరిసిపోయింది. మామగార్లు ఏదైనా కొనుక్కోమని డబ్బిస్తే ఈ అల్లుళ్ళు ఎంత పొంగిపోతారో నాకా క్షణాన తెలిసిపోయింది. నాలో నేను నవ్వుకొని కేంపుకెళ్ళిపోయాను.

తిరిగి కేంపు నుంచి వచ్చేసరికి "మన అల్లుడిగారి గడియారం పోయిందండీ!" అంటూ ఏడుపు ముఖంతో ఎదురొచ్చి చెప్పింది శ్రీమతి. ఆవిడ వెనుకే అమ్మాయి నేలచూపులు చూస్తూ నిలబడింది. "గడియారం పోవడమేమిటి!?" అన్నాను అయోమయంగా.

"మన అల్లుడిగారి స్నేహితుడు పెళ్ళిచూపులు కెళుతున్నానని చెప్పి గడియారం పట్టుకెళ్ళాడటండీ!.... ఆరోజే తెచ్చిచ్చేస్తానన్న మనిషి మూడు రోజులైనా అయిపులేడట!" అంది బాధపడుతూ శ్రీమతి.

ఇంతలో ఇంటికొచ్చారు అల్లుడుగారు. నన్ను చూస్తూనే మోహం దించేసుకున్నారు.

"అప్పుడే గడియారం కొనడం— పోవడం జరిగిపోయిందన్నమాట! ఇంతకీ స్నేహితుడెవరండి అల్లుడుగారూ?" అన్నాను వస్తున్న కోపాన్నాపుకుంటూ.

"అతను ఇంతకు ముందు మా ఊళ్ళోనే ఉండేవాడండి... ఈ మధ్య నాలుగైదుసార్లు టైలరింగ్ షాపు వద్ద కొచ్చి కూర్చొని తను ఈ ఊరు వచ్చేశాననీ, ఇక్కడ చిన్నబజారులో కాయగూరల వ్యాపారం చేస్తున్నాననీ చెప్పాడండి. ఆ మాటలు నమ్మి గడియారం ఇచ్చాను. ఇంత దగా చేస్తాడనుకోలేదు!" అన్నారు బిడియపడుతూ అల్లుడుగారు.

"మరి అతనింటికెళ్ళి అడగలేక పోయారా!" అన్నాను.

"ఇల్లెక్కడో నాకు తెలియదండి! చిన్న బజారులో అతడికి కాయగూరల వ్యాపారం కూడా లేదు!" అన్నారు ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టి అల్లుడుగారు.


ఆయన చేసిన తెలివి తక్కువ పనికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు, "గడియారానికి ఎంత యిందేమిటండి?" అన్నాను క్షణకాలం తర్వాత.

అల్లుడుగారు గదిలోకెళ్ళి గడియారం తాలూకు గ్యారంటీ పత్రం తెచ్చి నాకిచ్చారు. ఆయన కొనుక్కున్నది ఆల్విన్ గడియారం. ఖరీదు అయిదు రూపాయలు తక్కువ అయిదు వందలు. ఎంతో ముచ్చట పడి కొనుక్కొని పట్టుమని పదిరోజులైనా పెట్టుకోకుండా గడియారం పోగొట్టుకున్న అల్లుడు గారిని చూస్తూంటే పట్టలేని కోపం వచ్చింది నాకు. అయినా ఏమనలేక పోయాను. ఏమనగలం చెప్పండి... ఎంతయినా అల్లుడాయె. అందుకని సాధ్యమైనంత శాంతంగా ఆ స్నేహితుడి వివరాలు చెప్పమని అడిగాను.

ఆయన చెప్పడాన్నిబట్టి గడియారం పట్టుకెళ్ళిన వాడిపేరు రాజు.... ఇంటిపేరు తెలియదు. అతగాడిది గుండ్రటి ముఖం. జుట్టుపైకి దువ్వుతాడు. పొట్టిగా, కాస్తంత ఎరుపుగా ఉంటాడు. ముందుపళ్ళు రెండు ఎత్తుగా ఉంటాయి. ఎప్పుడూ పోలియెస్టర్ బట్టల్ని ధరిస్తాడు. ప్యాంటురంగు ఏదైనా తెలుపు షర్టు మాత్రం విధిగా వేసుకుంటాడు. గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్లు కాలుస్తాడు....

# అల్లుడుగారూ ఆఫ్రికన్ గడియారం

- లక్ష్మీ శ్రీనివాసన్




ఇదంతా విన్నాక ఆ రాజనేవాడు మా అల్లుడి గారి గడియారం పట్టుకుపోయాడంటే నాకే నమ్మాలనిపించలేదు. అసలు ఇలాంటి మహా రాజు కాయగూరల వ్యాపారం చెయ్యడమేమి టబ్బా!... అర్థం కాకపోయినా ఆ రాజు కోసం నాలుగురోజులపాటు అదేపనిగా తిరిగి తిరిగి అల సిపోయాక ఇక అతణ్ణి పట్టుకోవడం అసంభవం అనిపించేసింది నాకు.

అయితే మా అందరికన్నా శ్రీమతి ఎక్కువగా బాధపడిపోతోంది. ఆ గడియారం పోయినప్పట్నుంచీ ఆవిడకు సరిగ్గా నిద్రాహారాలు లేవట. గుండె బరువై పోయిందట... ఎంత సేపూ అదే ఆలోచన ! ఇంటికొచ్చే వాళ్ళందరికీ చెప్పేసింది. ఇంకా ఊరుకోలేక పిఠాపురం గద్దెకెళ్ళింది. పెద్దాపురంలో ఎవరి చేతనో పద్మం వేయించింది. ఫలితం కనిపించకపోవడంతో నన్ను వేధించుకు తినడం మొదలుపెట్టింది...

కనీసం ఎక్కడుంటున్నాడో చూచాయగానైనా తెలియని దానికి నేను మటుకు ఏం చెయ్యను?... ఈలోగా సీతానగరంలో రాజుకు బంధువులున్నారని చిన్న కొసరందించారు మా అల్లుడుగారు. అంతే అప్పటికప్పుడు ప్రయాణమై సీతానగరం వెళ్ళి సాయంత్రానికి వచ్చేసింది శ్రీమతి.

వెళ్ళిన పని 'హుష్ కాకి' అవుతుందనుకున్నా నా ఊహను తారుమారు చేస్తూ వాళ్ళనుంచి కొన్ని వివరాలు సేకరించుకునే వచ్చింది. ఆ రాజు ఇంటిపేరు తెల్లాకుల వారు. ఆ ఊళ్లో ఆయన కలపవ్యాపారం చేసి ఎనిమిది వేలు ఎగనామం పెట్టి వచ్చేశాడు. ప్రస్తుతం మా ఊళ్ళోనే కొత్తపేట జంక్షన్‌లో కాయగూరలు మారుబేరం చేస్తూ చింతలవారిపేటలో కాపురం ఉంటున్నాడట.

శ్రీమతి చింతలవారి పేట గురించి చెప్పగానే ఆ పేటలో ఉంటున్న నా మిత్రుడు శ్రీహరి మనసులో మెదిలాడు. నిజంగా రాజు అక్కడే ఉన్నట్టయితే వెయ్యిళ్ళ పూజారి శ్రీహరికి తెలియకుండా ఉండదు. వెంటనే మా అల్లుడిగారిని వెంటబెట్టుకొని కొత్తపేట జంక్షన్‌కి వెళ్ళా. అక్కడ కాయగూరలు మారుబేరం వ్యాపారం చేసే కామరాజు, రామరాజు ఉన్నారే తప్ప మా అల్లుడెలా నమ్మేడండి బాబూ ఆ మాయదారి స్నేహితుణ్ణి!? మా మహారాజు మాత్రం లేదు. కొన్నాళ్ళ క్రితం ఎత్తుపళ్ళరాజు అక్కడ వ్యాపారం చేసిన మాట నిజమేననీ ఈ మధ్య అతడా జంక్షన్‌కి రావటం రావడంలేదనీ రామరాజు నడిగితే చెప్పాడు. నాలోని ఉత్సాహమంతా నీరు కారిపోగా అక్కణ్ణుంచి శ్రీహరి ఇంటి కెళ్ళాం. అదృష్టవశాత్తు ఇంట్లోనే ఉన్నాడు వాడు. నేను చెప్పినదంతా విని" తెల్లాకుల రాజా! ఏ ఇంట్లో ఉంటున్నాడో తెలియదుగాని పేరు విన్నానురా! '' అని కాస్సేపు ఆలోచించి ఇదో పెద్దిసమస్యా.. పద పది నిమిషాల్లో తెలుసుకుందాం! అంటూ బయటికొచ్చి, అన్నట్టుగానే రాజు ఏ ఇంట్లో ఉంటున్నాడో తెలుసుకున్నాడు. మరుక్షణం ఆత్రంగా ఆ ఇంటి మీదికెళ్ళి పడ్డాం...

"రాజా బాబూ! వాడు పరమదొంగ! నా దగ్గర మూడువేలు చీటీ పాడేసుకొని డబ్బు తీసుకున్నా తర్వాత మాయమైపొయ్యాడు!! ఆడదాన్ని నేనూ వాడి కోసం తిరుగుతున్నాను. మీకుగాని కనిపిస్తే ఆమాట నా చెవినెయ్యడం మరచిపోకండి!" అంది దాదాపు ఏడ్చినంత పనిజేసి ఆ ఇల్లు గలావిడ. ఇంతటి మోసగాడు, మహా మాయగాడు మా అల్లుడిగారి స్నేహితుడైనందుకు గర్వపడాలో, సిగ్గుపడాలో తెలీలేదు నాకు.

యజమాని: నీ ప్రవర్తన మంచిదని ఎవరి దగ్గర నుంచైనా లెటర్‌పత్రా?
రాజు: నేను మంచివాడిననీ జైలు అధికారులు ఆరు నెలలముందే విడుదల చేశారు. ఆ లెటర్ ఉంది అవసరం వస్తోందా?
యజమాని: ఆఁ!!

సి. శ్యామల
ధర్మవరం.




"నీ కెందుకు వాడీ పట్నంలో ఎక్కడున్నా పట్టుకుంటాను. నువ్వు నిశ్చింతగా ఇంటికెళ్ళు! '' అన్నాడు హామీ ఇస్తూ శ్రీహరి.

ఇంటికొచ్చి ఇదంతా చెప్పగానే శ్రీమతి తెల్లబోయింది. అప్పటికైనా పోతే పోయిన గడియారం అని ఊరుకుంటే బావుండును. అబ్బే అది మటుకు ఆవిడవల్ల కావటంలేదు. కలలోనైనా ఎవరికీ కీడు తలపెట్టని మనకు ఎందుకిలా జరగాలని ఆవిడబాధ.. అల్లుడుగారి చేతికి నిండుదనాన్నీ, అందాన్నీ తెచ్చిపెట్టిన ఆల్విన్ గడియారం పోయిందని ఆవిడ కొకటే బెంగ!!...

మొత్తానికీ సమస్య మహా తలనొప్పిగా పరిణమించడంతో నిన్న మా అల్లుడిగారిని "మీకు అసలు తలకాయ లేదండీ!" అనేసాను. దాంతో మా అమ్మాయికి ఉలుకొచ్చి సీమటపాకాయలా చిట చిటలాడిపోతూ" ఎంత తలున్న వాళ్ళయినా ఒక్కోసారి మోసపోతుంటారు నాన్నా! మీరు అలాంటి మాటలంటే నేను ఊరుకోను!" అంది భర్తగారిని వెనకేసుకొస్తూ. మా అమ్మాయి మాటలు కాదనడానికి వీల్లేదు కాని, మా అల్లుడిగారికి తలంటూ ఉంటే ఎందుకింత తేలిగ్గా మోసపోతారు?.. తండ్రి తనయుణ్ణి నమ్మడంలేదే... అన్న తమ్ముణ్ణీ తమ్ముడు అన్ననీ నమ్మడంలేదే.. అసలు మనిషి మనిషినే నమ్మడం లేని దానికి

మా అల్లుడెలా నమ్మేడండి బాబూ ఆ మాయదారి స్నేహితుణ్ణి!?...

ఏమైతేనేం ఈవేళ్టికా గడియారం పోయి సరిగ్గా వారం రోజులైంది. ఇప్పుడు ఇంటికెళ్ళగానే మళ్ళీ మొదలవుతుంది కథ!... అప్పుడే వెళ్ళడమా —మానడమా అన్న సందిగ్ధంలో నేనుండగానే —"టైమైంది బాబూ!" అన్నాడూ వాచ్‌మేన్ చల్లగా వచ్చి. ఇక కదలక తప్పలేదు. పార్కులోంచి బయటికొచ్చి మెల్లగా ఇంటివైపు నడవసాగేను.

ఈ వారం రోజులుగా చిరునవ్వు మరచిపోయిన శ్రీమతి ముఖం కళ్ళముందు కదలాడుతోంది. ఆమె ముఖం ఎప్పటిలా కళకళలాడుతూ ఉండాలంటే నా దుంప తెంపేస్తున్న ఈ గడియారం గొడవ వొదిలిపోవాలి. మాయదారి గడియారం కళ్ళతో చూడనైనా చూళ్ళేదు! పోనీ, మరొక గడియారం ఏదైనా కొనిపడేస్తే ఈ గొడవ తగ్గుతుందేమో. కానీ డబ్బు?... అనంతయ్య అప్పు ఇంకా అలాగే ఉందే?... ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు.

* * *

శ్రీహరి ఉన్నాడు నేను ఇంటికొచ్చేసరికి. నన్ను చూస్తూనే చిద్విలాసంగా నవ్వాడు. వాడు అలా నవ్వడాన్ని బట్టి శుభవార్త ఏదో తీసుకొచ్చాడనే అనిపించింది.

"ఇప్పుడా రావడం! ఆయన ఎంతసేపట్నుంచి ఎదురు చూస్తున్నారో తెలుసా!" అంది రుసరుసలాడుతూ శ్రీమతి.

శ్రీమతికి సమాధానం చెప్పకుండా శ్రీహరి దగ్గరగా కుర్చీ వేసుక్కూర్చొని "ఏమైనా తెలిసిందేమిట్రా?" అన్నాను ఆత్రంగా.

"తెలిసింది గనకే ఇంతసేపైనా నీకోసం కాచుకొని ఉన్నానురా! ఆ చిత్రాంగి సుందరమ్మ మొన్ననే వాడి అడ్రసు చెప్పి ఉంటే ఈసరికి గడియారం మన చేతికొచ్చి ఉండేది!" అన్నాడు శ్రీహరి.

"సుందరమ్మా!... ఆవిడెవరు?"

"నీ మొహంలా ఉంది! ఆ రోజు చీటీ పాడేసుకొని రాజు డబ్బు పట్టుకుపోయాడని వగలేడ్చ్వులే . డ్చింది చూడు —ఆవిడ పేరే సుందరమ్మ! రాజు ఎక్కడుంటున్నాడో సుందరమ్మకి తెలుసురా! పది రోజుల క్రితం వెళ్ళి తన చీటీ డబ్బు కొంత వసూలు చేసి తెచ్చుకుందట!... ఇదంతా ఆవిడకు సన్నిహితురాలైన మరొకామె ద్వారా తెలుసుకున్నాను."

"ఇంతకీ వాడు ఎక్కడున్నాడట?" ఆత్రం పట్టలేక వాడి మాటలకు మధ్యలోనే అడ్డొచ్చి అడిగేను.

"బాలాజీనగర్ భాగవతుల భూషయ్యగారింట్లో ఉంటున్నాడట. రాజు మనకు దొరకాలంటే ఈ సమయంలోనే వెళ్ళాలి —లేదా తెల్లవారకుండా వెళ్ళాలి. ఏంచేద్దామో నువ్వే నిశ్చయించు!" అన్నాడు కించిత్ గర్వంతో శ్రీహరి.

"ఇప్పుడే వెళితే మంచిది!"అంది 'ఆలస్యం అమృతం విషం!' అయిపోతుందేమోనన్నట్టుగా శ్రీమతి.

అభినందిస్తూ శ్రీహరి భుజం తట్టి "సరే, ఇప్పుడే వెళదాం రా!" అన్నాను. ఈనాటితోనైనా ఈ గడియారం గొడవ ఒదిలిపోతే శ్రీమతి హాయిగా నిద్రపోతుందని నా ఆశ.

"మరి మనకో ఇద్దరు పెద్దమనుషులండాలి. ఆ రాజు తలబిరుసుగా మాట్లాడినా —తనకు తెలీదన్నా గడియారం పట్టుకొచ్చినట్టు వాళ్ళు గట్టిగా చెప్పగలగాలి!" అన్నాడు ముందు జాగ్రత్తతో శ్రీహరి.

వాడు చెప్పింది నిజమే అనిపించి —మా పక్కింటాయన్ని రమ్మని కోరాను. ఇక రెండో వ్యక్తిగా దారిలో ఉన్న టైలరింగ్ షాపు యజమాని బాబూరావుగారిని తీసుకెళ్ళడానికి నిశ్చయించుకొని మా అల్లుడు, అబ్బాయితో సహా అందరం బయలుదేరాం. అడగ్గానే బాబూరావుగారు. కూడా మా వెంట వచ్చారు.

మేమంతా బాలాజీనగర్ చేరుకొని, భూషయ్యగారి ఇల్లు తెలుసుకునే సరికి పది గంటలు దాటింది. ఇంట్లో అంతా పడుకున్నారేమో —ఏ గదిలోనూ లైటు వెలగడం లేదు. సందేహిస్తూనే తలుపు తట్టాడు శ్రీహరి.

అయిదు నిమిషాల తర్వాత వీధి గుమ్మంలో లైటు వెలిగింది. తలుపు తెరుచుకొని యాభై ఏళ్ళు పైబడ్డాయన బయటకు వచ్చి "ఎవరండి మీరు? ఏం కావాలి?" అన్నాడు.

"భూషయ్యగారు మీరే కదండి!" అనుమానంగా అడిగేడు శ్రీహరి.

"ఔను నేనే!" కంచుగంటలా ధ్వనించిందాయన గొంతు.

"మీ ఇంట్లో ఉంటున్న తెల్లాకుల రాజు కోసం వచ్చాం సార్! ఒక్కసారతణ్ణి పిలుస్తారా?" వినయంగా అన్నాడు శ్రీహరి.

అంతే ఆయన ముఖంలో రంగులు మారాయి. అరక్షణంలో ఉగ్రనరసింహ రూపం దాల్చేశాడు. కొన్ని క్షణాల తర్వాత తనని తాను సంభాళించుకునేందుకు ప్రయత్నిస్తూ —"అయ్యా! మీ అందరికీ నమస్కారాలు!... నిన్ననే వాణ్ణి పట్టుబట్టి ఇల్లు ఖాళీ చేయించేశాను... ఈ విషయం మీకు తెలిసిన వాళ్ళందరికీ చెప్పండి... మా ఇంటి మీదికొచ్చి పడొద్దని చెప్పండి... అమ్మమ్మ!... రోజుకెంతమందికని చెప్పను?... ఒక్కరా —ఇద్దరా!... పగలా —రాత్రా!... బుద్ధి తక్కువై అలాంటివాడికి నా ఇల్లిచ్చాను. మహాప్రభో! మీ అందరికీ మరోసారి నా నమస్కారాలు!! వెళ్ళండి..." అంటూ —శివమెత్తినవాడిలా చిందులేస్తూ లోపలకు వెళ్ళి తలుపు భడాలున మూసుకున్నాడాయన.

మతిపోయి బొమ్మల్లా నిలబడిపోయాం! తల తిప్పి వెంట వచ్చిన పెద్దమనుషులు ముఖాలు చూడ్డానికి సిగ్గేసింది నాకు!... ఇంతటికీ కారణమైన అల్లుడుగారిని చూస్తుంటే ఒళ్ళు మండటంతో పాటు నా పళ్ళు పటపటమన్నాయి.

"మళ్ళీ కథ మొదటికొచ్చింది! ఇక ఇక్కడెందుకు నిలబడ్డం? వెళదాం పదండి!" శ్రీహరి అనడంతోనే వచ్చినదారే పట్టుకొని ఉసూరుమంటూ ఇల్లు చేరాం.

"ఏమైందండీ? ఆ రాజు దొరికాడా? గడియారం ఇచ్చాడా??..." నన్ను చూస్తూనే ప్రశ్నల వర్షం కురిపించసాగింది శ్రీమతి.

లావాలా పొంగుకొస్తున్న కోపాన్ని నిగ్రహించుకొని —జరిగిన విషయం చెప్పి "ఇక నువ్వు ఆ గడియారం గొడవ తేవద్దు... తెచ్చావో రేపట్నుంచి నేను ఇంటికొచ్చేది లేదు!" అన్నాను ఖచ్చితంగా.

ఏమనుకుందో శ్రీమతి మరెప్పుడూ ఆ గడియారం గొడవ తేలేదు కానీ —మించిపోయినట్టు సంక్రాంతి పండుగ వచ్చెయ్యడంతో మరొక గడియారం అల్లుడుగారికి కొనివ్వమని ప్రాధేయపడ్డం మొదలుపెట్టింది. శ్రీమతి అంతలా ప్రాధేయపడ్డానికి పరోక్షంగా మా అమ్మాయి కారణమని నాకు తెలుసు. బోసిగా ఉన్న అల్లుడుగారి చెయ్యి చూస్తుంటే నాకూ బాధనిపించింది.

ఇహ తప్పదనుకొని పండుగ మూడు రోజులుండనగా —మూడువందల నలభై రూపాయలు పెట్టి గడియారం కొని తెచ్చి అల్లుడిగారికి ఇస్తూ "ఈసారి మాత్రం ఎవరికీ గడియారం ఇచ్చి మాకు మనశ్శాంతి లేకుండా చెయ్యకండి! వస్తువు ఎరువిస్తే ఏమైందో —ఎంత యాతనపడ్డామో సదా గుర్తుంచుకోండి!" అన్నాను హెచ్చరిస్తూ.

సిగ్గుపడుతూ అల్లుడుగారు గడియారం తీసుకొని "ఇది నాదేలా ఉందండీ!" అన్నారు చటుక్కున.

"మీకింకా ఆ గడియారం మరుపుకు రావటం లేదులా ఉంది! ఇదీ ఆల్విన్ గడియారమే కాని మీది కాదు. అలాంటి భ్రమ పెట్టుకోక జాగ్రత్తగా వాడుకోండి!" అన్నాను నవ్వుతూ.'

"కాదండీ! ఈ గడియారం నాదే!!" అన్నారు దృఢస్వరంతో అల్లుడుగారు.

శ్రీమతితో పాటు మా ముగ్గురు పిల్లలూ కూడా ఒకరి తర్వాత ఒకరు ఆ గడియారాన్ని పరీక్షించి, పరిశీలించి చివరకు అల్లుడిగారి మాటనే బలపర్చారు.

వాళ్ళంతా ఏక కంఠంతో ఆ మాటే అంటూ ఉంటే నాకూ అనుమానం వచ్చింది. అదేదో తేల్చుకుందామని గబగబా లోపలికెళ్ళి —పోయిన గడియారం తాలూకు గ్యారంటీపత్రం తెచ్చి రెండింటి మీదా ఉన్న సీరియల్ నెంబరు చూశాను...

నిజమే, మా అల్లుడుగారు పొరపడలేదు! భ్రమ పడలేదు! నిస్సందేహంగా ఆ గడియారం ఆయనదే!!

అసలు విషయం అప్పుడర్థమైంది నాకు.

మా అల్లుడిగారి ప్రియ మిత్రుడు పెళ్ళిచూపుల పేరుతో గడియారం పట్టుకెళ్ళి తాకట్టు పెట్టేసి ఉంటాడు —తాకట్టులో వొదిలేసిన గడియారం ఏదైనా కొందామని సేఠ్ చందన్‌లాల్ వద్దకెళ్ళి —అతడు చూపించిన అయిదారు గడియారాల్లో ఆల్విన్ గడియారమే బాగుండటంతో అదే తీసుకోవడం జరిగింది. అంటే —మా గడియారం నేనే కొనుక్కొచ్చానన్నమాట!

మొత్తానికి ఆ మోసాల మారాజు ఎక్కడున్నాడో తెలియకపోయినా మా అల్లుడిగారి ఆల్విన్ గడియారం మటుకు తిరిగి ఆయన చేతి నలంకరించింది.

ప్రయాణీకుడు: ఏమయ్యా! డ్రైవర్ బస్సు ఆపి వేశావు ఏమిటి?
డ్రైవర్: పెట్రోలు అయిపోయింది! బస్సు ముందుకు నడవడం లేదు.
ప్రయాణీకుడు: సరే వెనక్కి పోనియ్యి.
డ్రైవర్: ఆ:!!

సి. శ్యామల
ధర్మవరం

